సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం ■ 5 ■ ఏప్రిల్ ■ 2023



కారం.. బేరం !

గతేడాది లాభం గడించిన ఖమ్మం ఎస్‌హెచ్‌జీల సభ్యులు ఈ ఏడాది కూడా మిర్చి వ్యాపారం ప్రారంభించారు.

8లో



...హక్కు కల్పించాలి

సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంట్రాక్ట్ కార్మికులకూ ఓటు హక్కు కల్పించాలని నాయకులు కోరుతున్నారు.

10లో

గరిష్టం / కనిష్టం
38° / 24°

వాతావరణం

జిల్లాలో బుధవారం మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి వేళ ఉక్కపోతగా ఉంటుంది.



న్యూస్‌రీల్

ఎమ్మెల్యే పడిగాపులు..!



ఎంపీపీ ఆఫీసులో వేచి చూస్తున్న అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా

అశ్వారావుపేటరూరల్‌: సాధారణంగా శాసన సభ్యుడి కోసం అధికారులు, సర్పంచ్‌లు ఎదురు చూస్తుంటారు. కానీ అశ్వారావుపేటలో మాత్రం ఇందుకు భిన్నంగా జరిగింది. స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో మంగళవారం తాగునీటి సమస్యపై ఎమ్మెల్యే.. మిషన్‌ భగీరథ, అధికారులు, మండలంలోని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, మిషన్‌ భగీరథ అధికారులు, కార్యదర్శులకు సమాచారం అందించారు. కాగా నిర్ణీత సమయానికి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు హాజరు కాగా, సర్పంచ్‌లు, కొందరు అధికారులు గంట ఆలస్యంగా వచ్చారు. దీంతో వారువచ్చేవరకు ఎమ్మెల్యే ఎంపీపీ ఆఫీసులో పడిగాపులు కాయాల్సి వచ్చింది. చివరికి 12 గంటల 10 నిమిషాలకు వారంతా హాజరు కావడంతో ఎమ్మెల్యే సమీక్ష ప్రారంభించారు.

జగ్జీవన్‌రామ్‌ జీవితం అందరికీ ఆదర్శం

మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌

ఖమ్మంమయూరిసెంటర్‌ : స్వాతంత్య్ర సమర యోధుడు, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌ రామ్‌ జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని, సమాజ హితం కోసం ఆయన చేసిన సేవలు మహోన్నతమైనవని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ ఒక ప్రకటనలో కొనియాడారు. నేడు జగ్జీవన్‌రామ్‌ జయంతి సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవలను మంత్రి పువ్వాడ స్మరించుకున్నారు. తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఉపప్రధాని పదవితో పాటు, పలు మంత్రిత్వ శాఖలు చేపట్టి ఆయా రంగాల్లో తనదైన ముద్ర వేశారని, దేశ పురోభివృద్ధికి పునాదులు వేశారని నివాళులర్పించారు. ఆయన స్ఫూర్తితోనే రాష్ట్ర ప్రభుత్వం పేద, వెనుకబడిన, గిరిజన, దళిత వర్గాల అభ్యున్నతికి పాటు పడుతోందని పేర్కొన్నారు. దళితబంధు పథకంతో ఆ వర్గాల వారి సమగ్రాభివృద్ధికి చర్యలు చేపడుతోందని తెలిపారు.

అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి : నామ

అట్టడుగు వర్గాల శ్రేయస్సు కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి బాబూ జగ్జీవన్‌ రామ్‌ అని బీఆర్‌ఎస్‌ లోక్‌సభా పక్ష నాయకులు, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వర రావు పేర్కొన్నారు. అసమాన ప్రతిభ కలిగిన అతికొద్ది మందిలో ఆయన ముఖ్యులని తెలిపారు. ఆయన కుమార్తె మీరా కుమార్‌ గతంలో లోక్‌సభ స్పీకర్‌గా పని చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

డయాగ్నస్టిక్‌ సెంటర్లలో తనిఖీలు

ఇల్లెందు: పట్టణంలో పలు డయాగ్నస్టిక్‌ సెంటర్లను జిల్లా వైద్యాధికారుల బృందం తనిఖీ చేసింది. డీఎంహెచ్‌ఓ జేవీఎల్‌ శిరీష ఆదేశానుసారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుకృత ఆధ్వర్యంలోని అధికారుల బృందం పట్టణంలోని పలు డయాగ్నస్టిక్‌ సెంటర్లను తనిఖీ చేశారు. ఆయా సెంటర్లకు ఉన్న అనుమతులు, అక్కడ పనిచేస్తున్న సిబ్బంది అర్హత పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్‌ సుకృత మాట్లాడుతూ అన్ని సెంటర్ల అనుమతులు, పని చేసే సిబ్బంది అర్హతలు, వారిచ్చే రిపోర్టులు తనిఖీ చేస్తున్నామని తెలిపారు. తనిఖీ బృందంలో డాక్టర్‌ సుందర్‌, హెల్త్‌ ఎడ్యుకేటర్స్‌ టి.విజయకుమార్‌, వి.రమణారెడ్డి ఉన్నారు.

పోడుపై నీలినీడలు!



పోడు భూములను సర్వే చేస్తున్న అధికారులు(ఫైల్‌)

పట్టాలు సిద్ధమైనా పంపిణీ చేయని ప్రభుత్వం

- జిల్లాలో 44,041 వేల హక్కు పత్రాలు రెడీ
- చట్ట విరుద్ధమని అటవీశాఖ అభ్యంతరం
- డీఎల్‌సీలో నిలిచిన పోడు పట్టాల ప్రక్రియ

చుంచుపల్లి: పోడు సాగుదారులకు అటవీ హక్కు పత్రాల పంపిణీపై నీలినీడలు అలుముకుంటున్నాయి. రెండు నెలల క్రితం ముఖ్యమంత్రి కేసీఆర్‌ అసెంబ్లీలో ప్రకటన చేయగానే, అధికారులు పట్టాలు సిద్ధం చేశారు. కానీ విధివిధానాలు అటవీ హక్కుల చట్టానికి విరుద్ధంగా ఉన్నాయంటూ అటవీ శాఖ చెబుతోంది. దీంతో పంపిణీలో తీవ్ర జాప్యం జరుగుతోంది. అర్హులైన లబ్ధిదారులకు అటవీ హక్కుల చట్టం–2005 ప్రకారం హక్కు పత్రాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన బడ్జెట్‌ సమావేశాల్లో పోడు పట్టాల పంపిణీపై ముఖ్యమంత్రి కేసీఆర్‌ ప్రకటన చేయగా, లబ్ధిదారుల ఎంపిక కోసం అధికారులు తీవ్ర కసరత్తు చేశారు. తొలుత అటవీ హక్కుల చట్టం నిబంధనల మేరకు అర్హత గలిగిన పోడు దరఖాస్తులను అధికారులు ఎస్‌డీఎల్‌సీ నుంచి డీఎల్‌సీ ఆమోదానికి పంపారు. ఈ తరుణంలోనే ప్రభుత్వం జోక్యం చేసుకొని అటవీ హక్కుల నిబంధనలు పక్కన బెడుతూ అర్హులైన గిరిజనులందరికీ పట్టాలు జారీ చేయాలని మౌఖికంగా సూచించింది. దీంతో మరోసారి అధికార యంత్రాంగం పోడు దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిశీలన చేసి డీఎల్‌సీ ఆమోదానికి పంపారు. డీఎల్‌సీ వద్దకు పంపిన పోడు దరఖాస్తుల ఆధారంగా వాటికి హక్కు పత్రాలు, పాస్‌ పుస్తకాలను అప్పటికప్పుడు సిద్ధం చేసి ఉంచారు. కాగా ప్రభుత్వం సూచించిన విధంగా కాకుండా అటవీ హక్కుల చట్టం నిబంధనల ప్రకారం మాత్రమే వ్యవహరిస్తామని అటవీశాఖ తేల్చి చెప్పింది. తమకు భవిష్యత్‌లో శాఖపరమైన చిక్కులు వస్తాయని భావించిన అటవీశాఖ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా జారీ చేసే పట్టాలపై సంతకాలు పెట్టేందుకు ముందుకు రావడం లేదు. దీంతో డీఎల్‌సీకి వెళ్లిన పోడు దరఖాస్తులకు ఆమోదం ముద్ర పడటంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రభుత్వ నిర్ణయం అటవీ హక్కుల చట్టానికి పూర్తి విరుద్ధమంటూ ఇప్పటికే కొందరు కోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది.

డీఎల్‌సీస్థాయిలో 44,041 దరఖాస్తులు

జిల్లాలో వచ్చిన పోడు దరఖాస్తులపై ఇప్పటికే రెండుసార్లు కసరత్తు చేసిన అధికారులు చివరకు 44,041 దరఖాస్తులను (గిరిజనుల) జిల్లాస్థాయి కమిటీ ఆమోదానికి సబ్‌డివిజనల్‌ స్థాయి కమిటీ సిఫారసు చేసింది. ఈ ప్రక్రియ పూర్తయి దాదాపు నెల రోజులు దాటుతోంది. గడిచిన నెల రోజులుగా పోడు పట్టాల ప్రక్రియలో ఎలాంటి పురోగతీ కనిపించడం లేదు. లబ్ధిదారుల ఎంపిక డీఎల్‌సీ ఆమోదానికి నోచుకోలేదు. ఈ ప్రక్రియ ఈ నెలలో కూడా ఒక కొలిక్కివస్తుందన్న స్పష్టత అధికారుల్లో కనిపించడం లేదు. ప్రభుత్వం పోడు పట్టాల పంపిణీ అంశాన్ని సాగదీస్తూ వస్తుందే తప్ప సీరియస్‌గా తీసుకోకపోవడం లేదని పోడు సాగుదారులు వాపోతున్నారు. జిల్లాలో 21 మండలాల పరిధిలో పోడు భూములు విస్తరించి ఉన్నాయి. మొత్తం 313 గ్రామపంచాయతీల పరిధిలో 717 ఆవాస గ్రామాల్లో గిరిజనలు పోడుసాగు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. పోడు హక్కు పట్టాల కోసం జిల్లాలో 83,341 దరఖాస్తులు వచ్చాయి. వీటి పరిధిలో 2.98 లక్షల ఎకరాల భూములు సాగులో ఉన్నట్లు తేలింది. ఇందులో 65,616 మంది గిరిజనులు 2,41,102 ఎకరాల పరిధిలో పోడు హక్కుపత్రాల కోసం దరఖాస్తులను సమర్పించారు. ప్రస్తుతం ప్రభుత్వం గిరిజనులకు మాత్రమే పట్టాలు ఇవ్వాలని నిర్ణయించింది. గిరిజనుల పోడు దరఖాస్తుల పరిశీలించిన అనంతరం 21,603 ఎస్‌డీఎల్‌సీలో తిరస్కరించగా, మిగిలిన 44,041 దరఖాస్తులను డీఎల్‌సీ ఆమోదానికి పంపారు. ప్రస్తుతం డీఎల్‌సీ పరిధిలో ఉన్న దరఖాస్తులకు 1,33,141 ఎకరాల భూమిని పంపిణీ చేయాల్సి ఉంటుంది. తరతరాలుగా పోడు భూములపై ఆధార పడిన గిరిజనేతరులు కూడా పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరంతా దరఖాస్తుతో పాటు అందజేసిన పత్రాలను అటవీ హక్కుల కమిటీలు, రెవెన్యూ, అటవీ అధికారులు పరిశీలించారు. అటవీ హక్కుల చట్టం–2005 ప్రకారం గిరిజనేతరులకు పోడు భూములపై హక్కులు పొందేందుకు మూడు తరాలుగా అటవీ ప్రాంతంలో నివాసితులై ఉండాలి. ఆ మేరకు ఒక తరాన్ని 25 ఏళ్లుగా పరిగణనలోకి తీసుకుంటే 2005 నాటికి 75 ఏళ్లుగా అక్కడే ఉన్నట్లు ఆధారాలు చూపాలి. ఆ వివరాలు వచ్చే వరకు జిల్లాలో వచ్చిన 17,725 గిరిజనేతరుల దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టాలని జిల్లా కమిటీ నిర్ణయించింది.

రైతులను ఆదుకుంటాం

కలెక్టర్‌ అనుదీప్‌

ఇల్లెందురూరల్‌: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన ప్రతీ రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని కలెక్టర్‌ అనుదీప్‌ తెలిపారు. మండలంలోని మస్సివాగు, మాణిక్యారం, బోయితండా గ్రామపంచాయతీల్లో నేలవాలిన మొక్కజొన్న పంటను మంగళవారం ఆయన పరిశీలించారు. మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారని, పంట నేలవాలగా, కంకులను కోసేందుకు కూలీ రేట్లు మూడు రెట్లు వెచ్చించాల్సి వస్తోందని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, పీఏసీఎస్‌ డైరెక్టర్‌ కిన్నెర నర్సయ్య, డీసీసీబీ డైరెక్టర్‌ జనగం కోటేశ్వర రావు తదితరులు వివరించారు. వడగండ్ల వర్షంతో మామిడి, మిర్చి, కూరగాయల రైతులు నష్టపోయారని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్‌ అనుదీప్‌, స్థానిక ఎమ్మెల్యే హరిప్రియ పలువురు రైతులతో మాట్లాడి యాసంగిలో పంటసాగు విస్తీర్ణం, జరిగిన నష్టం తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ నష్టపోయిన ప్రతీరైతుకు నష్టపరిహారం అందించేందుకు వ్యవసాయ, ఉద్యాన శాఖల ద్వారా క్షేత్ర పర్యటన జరుగుతోందని వివరించారు. అనర్హులకు పరిహారం అందకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ దిండిగాల రాజేందర్‌, రైతుబంధు సమితి రాష్ట్ర సలహాదారు పులిగళ్ళ మాధవరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి అభిమన్యుడు, ఉద్యాన శాఖ అధికారి జినుగు మరియన్న, తహసీల్దార్‌ కృష్ణవేణి, ఎంపీడీఓ అప్పారావు, ఎంపీఓ చిరంజీవి, ఏడీఏ వాసవీరాణి, ఏఓ సతీష్‌, సర్పంచ్‌లు, వివధ రాజకీయ పక్షాల నాయకులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్‌ అనుదీప్‌, పక్కన ఎమ్మెల్యే హరిప్రియ తదితరులు

ఆరోగ్య సమాజం నిర్మించుకుందాం

ఇల్లెందురూరల్‌: ప్రజలంతా ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించుకోవడంలో సంపూర్ణంగా భాగస్వాములు కావాలని కలెక్టర్‌ అనుదీప్‌ సూచించారు. మండలంలోని కొమరారం పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళ, బోయితండా గ్రామంలో కంటివెలుగు శిబిరాలను మంగళవారం ఆయన సందర్శించారు. అందిస్తున్న సేవలను వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ ప్రతి మంగళవారం కొమరారం పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. అంతకుముందు బోయితండాలో కంటివెలుగు శిబిరాన్ని సందర్శించి, వైద్య పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా బోయితండా రహదారికి సంబంధించి అటవీశాఖ అనుమతులు త్వరితగతిన మంజూరయ్యేలా చూడాలని సర్పంచ్‌ బానోత్‌ సంతు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ శిరీష, ఆరోగ్య మహిళ ప్రోగ్రాం అధికారి మణికంఠ, కంటివెలుగు అధికారి సాయికుమార్‌, పీఎంఓ గంధం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం తనిఖీ

సూపర్‌బజార్‌(కొత్తగూడెం): ఆర్డీఓ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఈవీఎం, వీవీప్యాట్‌ గోదాంను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ అనుదీప్‌ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ప్రతి మూడు నెలలకోసారి రాజకీయపార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం, వీవీప్యాట్‌ గోదాం తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. గోదాంలోని అగ్నిమాపక నిరోధకాలను, సీసీ కెమెరాలను, వీవీప్యాట్‌లు, ఈవీఎంలను పరిశీలించారు. అనంతరం రిజిస్టర్‌లో సంతకం చేశారు. తనిఖీ నివేదికను ఎన్నికల కార్యాలయానికి పంపనున్నట్లు చెప్పారు. రాజకీయ ప్రతినిధుల సమక్షంలో గోదాంకు తిరిగి సీల్‌ వేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌ కె.వెంకటేశ్వర్లు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సురేష్‌, సిబ్బంది నవీన్‌, రాజకీయ పార్టీల ప్రతినిధులు బీఆర్‌ఎస్‌ నుంచి సత్యనారాయణ, కాంగ్రెస్‌ నుంచి సంతోష్‌కుమార్‌, బీజేపీ నుంచి లక్ష్మణ్‌ అగర్వాల్‌ పాల్గొన్నారు.



గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్‌ అనుదీప్‌

అక్రమాలకు తావు లేకుండా..

సూపర్‌బజార్‌(కొత్తగూడెం): పదో తరగతి పరీక్షలు అక్రమాలకు తావు లేకుండా నిర్వహించాలని కలెక్టర్‌ అనుదీప్‌ ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై మంగళవారం రెవెన్యూ, పోలీస్‌, వైద్య, పంచాయతీ, విద్యుత్‌, పోస్టల్‌, ఆర్టీసీ, మున్సిపల్‌, రవాణా, చీఫ్‌ సూపరింటెండెంట్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓ తదితరులతో టెలీకాన్ఫరెన్స్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్‌ వస్తువులు తీసుకెళ్లేందుకు ఎవరికీ అనుమతిలేదని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల సమీపంలో 144 సెక్షన్‌ పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు. కేంద్రాల సమీపంలో అన్ని జిరాక్స్‌ కేంద్రాలను మూసి ఉంచాలని అన్నారు. ఏదైనా అక్రమాలకు పాల్పడినా, ప్రశ్నాపత్రాలు లీక్‌ చేసినా కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్‌ కె.వెంకటేశ్వర్లు, డీఈఓ సోమశేఖరశర్మ, విద్యుత్‌ ఎస్‌ఈ రమేష్‌, డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ శిరీష, డీపీఓ రమాకాంత్‌ పాల్గొన్నారు.

పరీక్షలు ప్రశాంతంగా జరగాలి

టేకులపల్లి: పరీక్షలు ప్రశాంతంగా జరగాలని, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని కలెక్టర్‌ అనుదీప్‌ దురిశెట్టి సూచించారు. మంగళవారం మండలంలోని సులానగర్‌ జెడ్పీ హైస్కూల్‌ పరీక్షా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో ఉన్న సౌకర్యాలను పరిశీలించి మాట్లాడారు. తహసీల్దార్‌ అబ్దుల్‌ పాషా, ఎస్‌ఐ రమణారెడ్డి, పరీక్షా కేంద్రం సీఎస్‌ జగన్‌, డీఓ వాల్యా ఉన్నారు.

కల్యాణ రాముడికి వసంతోత్సవం



కల్యాణ రామయ్యకు వసంతోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



పుర వీధుల్లో స్వామివారి ఊరేగింపు..

నేటితో ముగియనున్న బ్రహ్మోత్సవాలు

భద్రాచలంటౌన్‌: శ్రీ సీతారామ చంద్రస్వామి వారి వసంతపక్ష ప్రయుక్త తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం బేడా మండపంలో కల్యాణ రామయ్యకు వైభవంగా వసంతోత్సవం నిర్వహించారు. ధ్వజారోహణ అనంతరం 8వ రోజున నూతన వధూవరులైన సీతారాములకు ఈ వేడుక జరుపుతారు. స్వామివారిని, అమ్మవారిని ఎదురెదురుగా కూర్చొబెట్టి ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితులు వసంతోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. తొలుత శ్రీసీతారాములపై వసంతాన్ని చల్లి అనంతరం భక్తులపై చల్లారు. అనంతరం తిరువీధుల్లో స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. శ్రీసీతారామ చంద్రస్వామి వార్లను దర్శించుకుని భక్తులు పులకించి పోయారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ రామాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి నిత్యకల్యాణం

భద్రాద్రి రామాలయంలో శ్రీసీతారామచంద్ర స్వామివారి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు గత నెల 26న ఉత్సవ మూర్తులకు విశేష స్నపనంతో ప్రారంభమయ్యాయి. 30న శ్రీరామనవమి, 31న పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నేడు చక్రతీర్థం, పూర్ణాహుతి, ధ్వజారోహణం, ద్వాదశ ప్రదక్షిణలు, శ్రీ పుష్పయాగం నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలు ముగియనుండటంతో గురువారం నుంచి స్వామివారి నిత్య కల్యాణం ప్రారంభం కానుంది.

రెండో రోజూ ప్రశాంతం..

కొత్తగూడెంఅర్బన్‌: పదో తరగతి పరీక్షలు రెండో రోజు కూడా జిల్లాలో ప్రశాంతంగా జరగాయని జిల్లా విద్యాశాఖాధికారి ఇ.సోమశేఖరశర్మ తెలిపారు. మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. రెగ్యులర్‌ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన 70 పరీక్ష కేంద్రాల్లో 12,468 విద్యార్థులు హాజరు కాగా, 60 మంది గైర్హాజరు అయ్యారని వివరించారు. కలెక్టర్‌ అనుదీప్‌ రెండు కేంద్రాలు, జిల్లా పరిశీలకుడు ఎస్‌.శ్రీనివాసాచారి 4, తాను కేంద్రాలను సందర్శించి, పరిశీలించినట్లు పేర్కొన్నారు.

విద్యాశాఖ కమిషనర్‌ అభినందన

భద్రాచలంటౌన్‌: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్‌ బీ డబుల్‌ ప్లస్‌ గ్రేడ్‌ రావడంపట్ల విద్యాశాఖ కమిషనర్‌ నవీన్‌ మిట్టల్‌ అభినందనలు తెలిపారు. కళాశాల అధ్యాపకులు మంగళవారం హైదరాబాద్‌లో విద్యాశాఖ కమిషనర్‌తోపాటు జాయింట్‌ డైరెక్టర్లు రాజేంద్ర సింగ్‌, యాదగిరి, అకడమిక్‌ గైడెన్స్‌ అధికారి తిరువెంగళాచారిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్‌ భద్రయ్య, వేముల కామేశ్వరరావు, శ్యాంప్రసాద్‌ పాల్గొన్నారు.

పత్తి విత్తన ధర పెంపు

బూర్గంపాడు: కేంద్ర ప్రభుత్వం సర్టిఫైడ్‌ పత్తి విత్తనాలను ధరలను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది 450 గ్రాముల ప్యాకెట్‌ను రూ.810లకు విక్రయించగా, ప్రస్తుతం రూ.853కు పెంచింది. దీంతో జిల్లా రైతులపై రూ.2.75 కోట్లకు పైగా అదనపు భారం పడనుంది. ఇప్పటికే విపరీతంగా పెరిగిన ఎరువులు, పురుగుల మందుల ధరలతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విత్తన ధరలు కూడా పెంచడంతో మరింత భారంగా మారనుంది. జిల్లాలో సుమారు 1.80 లక్షల ఎకరాల్లో రైతులు పత్తిని సాగు చేస్తున్నారు. వివిధ కంపెనీలకు చెందిన సుమారు 6లక్షల ప్యాకెట్ల విత్తనాలను రైతులు వినియోగిస్తున్నారు. గతంలో రైతులు నాన్‌ బీటీ పత్తి విత్తనాలను సాగు చేసేవారు. ప్రస్తుతం అందరూ సర్టిఫైడ్‌ బీటీ విత్తనాలనే సాగు చేస్తున్నారు. సర్టిఫైడ్‌ బీటీ విత్తనాల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో మూడు, నాలుగేళ్ల కొందరు రైతులు నకిలీ విత్తనాలను వేసుకుని నష్టపోతున్నారు. కాగా ఈ ఏడాది జిల్లాలో పత్తి పంట దిగుబడులు ఆశించిన స్థాయిలో లేవు. పత్తి ధర తొలుత ఆశాజనకంగా ఉండి, తర్వాత తగ్గిపోయింది. రానున్న ఏడాదికి కౌలు ధరలు కూడా అమాంతం పెరిగాయి. ప్రస్తుత సీజన్‌లో ఎకరం రూ.10 వేలు ఉండగా, రానున్న సీజన్‌కు రూ.15 వేలకు పెరిగింది. భూముల కౌలుతోపాటు విత్తనాలు, ఎరువులు ధరలు పెరగటం కౌలురైతులను కలవరపెడుతోంది.



పత్తి విత్తన ప్యాకెట్లు

‘బార్‌’ బాధ్యతల స్వీకరణ

సింగరేణి(కొత్తగూడెం): ఇటీవల ఎన్నికైన బార్‌ అసోసియేషన్‌ కార్యవర్గం మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించింది. కోర్టు ఆవరణలోని లైబ్రరీ హాల్‌లో అధ్యక్షుడు రమేష్‌కుమార్‌ మక్కడ్‌, ఉపాధ్యక్షుడు దుంద్ర రమేష్‌, ప్రధాన కార్యదర్శి రావిలాల రామారావు, సంయుక్త కార్యదర్శి కాసాని రమేష్‌, కోశాధికారి సంతోష్‌లాల్‌ సాహు, క్రీడా కార్యదర్శి పిట్టల రామారావు, గ్రంథాలయ కార్యదర్శి యాస యుగంధర్‌, మహిళా ప్రతినిధి ఏ.మనోరమ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల అధికారి పలివెల సాంబశివరావు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. నూతన కార్యవర్గం తాజా మాజీ కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా అధ్యక్షుడు రమేష్‌కుమార్‌ మక్కడ్‌ మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమానికి, హౌసింగ్‌ సొసైటీ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనుబోలు రాంప్రసాద్‌, బాగం మాధవరావు, మునిగడప వెంకటేశ్వరరావు, సాదిక్‌ పాష, ఆర్తి మక్కడ్‌, కె.శ్రీధర్‌, గాదె సునంద, జలసూత్రం శివరాం ప్రసాద్‌, ఉదయ భాస్కర్‌రావు, రేపాక వెంకటరత్నం, రవిచంద్ర, పుల్లయ్య, లక్కినేని సత్యనారాయణ తదతరులు పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరించిన బార్‌ అసోసియేషన్‌ కార్యవర్గం

కారుణ్యంలో ని‘బంధనాలు’..!

- ట్రాన్స్‌కో, డిస్కంలలో లేని నిబంధనలు కేవలం జెన్‌కోలోనే వర్తింపు
- నియామకాలు చేపట్టకుండా రెండేళ్లుగా జాప్యం చేస్తున్న యాజమాన్యం
- జీఓ నంబర్‌ 6తో ఇబ్బందులు పడుతున్న బాధిత కుటుంబాలు

పాల్వంచ: జెన్‌కో యాజమాన్య తీరుతో కారుణ్య నియామకాల్లో ఉద్యోగుల కుటుంబాలకు అన్యాయం జరుగుతోంది. విద్యుత్‌ సంస్థలైన టీఎస్‌ ట్రాన్స్‌కో, ఎన్‌పీడీసీఎల్‌, ఎస్‌పీడీసీఎల్‌ సంస్థల్లో లేని నిబంధనలు కేవలం జెన్‌కోలో మాత్రమే అమలు చేస్తున్నారు. జీఓ నంబర్‌ 6 అమలుపై ఉద్యోగ, కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఏపీఎస్‌ఈబీగా ఉన్న సమయంలో 1982లో జారీ చేసిన జీఓ 119ను పూర్తిగా విస్మరించారు. దీంతో కారుణ్య నియామకాలకు అభ్యర్థులు వందల సంఖ్యలో వేచిచూస్తుండగా, కొందరిని అనర్హులుగా పేర్కొంటున్నారు.

ఉద్యోగ కుటుంబాలకు అన్యాయం..

జెన్‌కో సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగి ఏదైనా కారణంతో మృతి చెందగానే ఎస్‌పీఎఫ్‌ విజిలెన్స్‌ వివరాలు సేకరిస్తుంది. చనిపోయిన ఏడాదిలో కుటుంబ సభ్యులు జనరేటింగ్‌ స్టేషన్‌ చీఫ్‌ ఇంజనీర్‌కు ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకోవాలి. దీంతో విద్యార్హతను బట్టి వారికి ఉద్యోగం కల్పించాలి. అయితే రెండేళ్ల క్రితం తెచ్చిన జీఓ నంబర్‌ 6 ద్వారా రెండో కారుణ్య నియామకాన్ని పూర్తిగా రద్దు చేశారు. చనిపోయిన ఉద్యోగి కుటుంబంలో వారసుల్లో ఎవరికీ ప్రభుత్వం ఉద్యోగం ఉన్నా ఆ కుటుంబ సభ్యులు కారుణ్య నియామకానికి అనర్హులని నిబంధన పెట్టారు. సొంత ఇల్లు, కారు ఉన్నా ఉద్యోగం ఇవ్వడంలేదు. ప్రాణాంతక వ్యాధులు, దీర్ఘకాలిక అనారోగ్యాలకు గురైన(మెడికల్‌ ఇన్‌వ్యాలిడేషన్‌)వారు రిటైర్మెంట్‌కు ఐదేళ్ల ముందు ఉద్యోగ విరమణ చేస్తే వారి వారసులకు ఉద్యోగం ఇచ్చేవారు. ప్రస్తుతం ఈ అవకాశాన్ని కూడా పూర్తిగా తొలగించారు.

విద్యార్హతను పరిగణనలోకి తీసుకోరా..?

ఉద్యోగి మృతి చెందితే అతని కుటుంబీకుల్లో ఒకరికి ఉద్యోగం ఇస్తారు. ఉద్యోగి పొందిన వ్యక్తి కూడా మృతి చెందితే రెండోసారి కారుణ్యం వర్తించదంటూ ఉద్యోగాలు ఇవ్వడం లేదు. ఒకసారి ఉద్యోగం పొందినా, రెండోసారి ఉద్యోగం పొందినా నిబంధనలు ఒకేలా ఉండాలని ఉద్యోగ, కార్మిక సంఘాలు డిమాండ్‌ చేస్తున్నాయి. కారుణ్య నియామకాల్లో బీటెక్‌, ఎంటెక్‌, డిప్లమా చదివిన వాళ్లకు సబ్‌ ఇంజనీర్‌ స్థాయి, డిగ్రీ పూర్తి చేసినవారికి జూనియర్‌ అసిస్టెంట్‌ పోస్టు ఇవ్వాల్సి ఉంటుంది. ఐటీఐ అభ్యర్థులకు జేపీఏ, పదో తరగతి చదివిన వారికి ఆఫీస్‌ సబార్డినేట్‌, వాచ్‌మెన్‌ పోస్టులు ఇవ్వాలి. కానీ నిబంధనలు సక్రమంగా అమలు చేయడంలేదు. గ్రేడ్‌–4 ఆర్టిజన్‌ చనిపోతే వారి వారసులు ఉన్నత చదువు చదివినా కూడా గ్రేడ్‌ 4 ఉద్యోగాన్నే కల్పిస్తున్నారు. వారి విద్యార్హత బట్టి గ్రేడ్‌–2 లేదా 2, 3 కల్పించడం లేదని కార్మిక సంఘాలు పేర్కొంటున్నాయి.



కేటీపీఎస్‌ కాంప్లెక్స్‌

అన్యాయం చేస్తున్నారు



ఏపీఎస్‌ఈబీ నుంచి జీఓ 119 ద్వారా కారుణ్య నియామకాలు అమలు చేస్తుండగా, ఇప్పుడు నిబంధనలుమార్చి అన్యాయం చేస్తున్నారు. కుటుంబంలో ఉద్యోగం, ఇల్లు ఉన్నాయంటూ దరఖాస్తులను తిరస్కరిస్తున్నారు. ఉద్యోగులు చనిపోతే 30 రోజుల్లో తిరిగి కుటుంబ సభ్యునికి ఉద్యోగం ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నా జెన్‌కోలో అమలు కావడం లేదు. మెడికల్‌ ఇన్‌వ్యాలిడేషన్‌ రద్దు అన్యాయం.

–ఎం.ఎ.వజీర్‌, టీఎస్‌ పవర్‌ ఎంప్లాయీస్‌ యూనియన్‌ (1535) సెంట్రల్‌ అధ్యక్షుడు

జీఓ నంబర్‌ 6ను సడలించాలి



జీఓ నంబర్‌ 6ను కేవలం టీఎస్‌ జెన్‌కోలో మాత్రమే తేవడంతో కారుణ్య నియామకాల కోసం ఎదురు చూసే ఉద్యోగ కుటుంబాలకు తీరని అన్యాయం జరుగుతోంది. కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం పొందాక, ఆ ఉద్యోగికి సంస్థ నిబంధనలన్నీ అమలవుతాయి. ఉద్యోగ కుటుంబం రెండోసారి కారుణ్య నియామకానికి అర్హులు కాదనడం సరికాదు.

–కేవీ.రామారావు, తెలంగాణా ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్‌ యూనియన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా

చికిత్స పొందుతున్న యువకుడు మృతి

గుండాల: పురుగులమందు తాగిన ఓ యువకుడు కొత్తగూడెం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన గడ్డం గణేశ్ (25) గత నెల 29న పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. ఎస్‌ఐ అరుణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని యువకుడు..

చండ్రుగొండ: మండలంలోని రావికంపాడు గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని యువకుడు కాకటి రామకృష్ణ (22) మృతి చెందాడు. ఎస్‌ఐ గొల్లపల్లి విజయలక్ష్మి కథనం ప్రకారం.. రావికంపాడు గ్రామానికి చెందిన రామకృష్ణ గత మార్చి 29న పురుగులమందు తాగాడు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మంగళవారం ఎస్‌ఐ తెలిపారు. రామకృష్ణ ఆరు నెలల వయస్సులో ఉన్నప్పుడే తల్లి మృతి చెందింది. తండ్రి రాఘవులు వేరే మహిళను వివాహం చేసుకున్నాడు. దీంతో రామకృష్ణను చిన్నప్పటి నుంచి నాయనమ్మ కాకటి వీరమ్మ సాకుతోంది. అయితే ఇటీవలకాలంగా తనకు వివాహం చేయమని నాయనమ్మను విసిగిస్తున్నాడు. నీకు పిల్లను ఎవరు ఇస్తారని నాయనమ్మ మందలించడంతో రామకృష్ణ పురుగులమందు తాగాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జ్వరంతో సింగరేణి ఉద్యోగి కన్నుమూత


శ్రీనివాసరావు (ఫైల్)

ఇల్లెందు: పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన సింగరేణి ఉద్యోగి కొంటు శ్రీనివాసరావు (38) జ్వరంతో మృతి చెందారు. ఆయన మణుగూరులో సింగరేణి సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. శ్రీనివాసరావుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. శ్రీనివాసరావు మృతితో ఇందిరానగర్‌లో విషాదం నెలకొంది.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత


పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

దుమ్ముగూడెం: మండలంలోని వెంకట్రాంపురం గ్రామంలోని గోదావరి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు సోమవారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నారు.. కొంత కాలంగా ఎటువంటి అనుమతులు లేకుండా గోదావరి నది నుంచి ఇసుక తరలిస్తుండగా అధికారులు నిఘా ఏర్పాటు చేసి ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని రెవెన్యూ కార్యాలయానికి తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

పాల్వంచరూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొని లారీ క్లీనర్ మృతిచెందిన ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని నాగారంకాలనీ వద్ద గల ఆర్టీఏ చెక్‌పోస్టులో మంగళవారం తెల్లవారుజామున తోగ్గూడెం నుంచి భద్రాచలం వైపు మెటల్‌ను తీసుకువెళ్తున్న లారీలో క్లీనర్‌గా బూర్గంపాడు మండలం ఉప్పుసాక గ్రామానికి చెందిన గుగులోతు రమేశ్ (36) పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో చెక్‌పోస్టులో పత్రాలు చూపించేందుకు రోడ్డు దాటుతున్నాడు. భద్రాచలం వైపు వేగంగా వెళ్తున్న గుర్తుతెలియని బొలేరో వాహనం ఢీకొనడంతో తలకు గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య నాగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ.శ్రీనివాస్ తెలిపారు.

కేసు నమోదు

పాల్వంచరూరల్: మండలంలోని దంతలబోరు గ్రామ పంచాయతీలోని గంగదేవిగుప్పా గ్రామ సమీపంలో సోమవారం రాత్రి వేగంగా నిర్లక్ష్యంగా డ్రైవింగ్‌చేసి మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో నాగేశ్వరరావు మృతి చెందగా ఆయన భార్య నాగరత్నకు తీవ్రగాయలైన విషయం విదితమే. మృతుడి సోదరుడు కందుకూరి కృష్ణార్జున్‌రావు ఫిర్యాదు మేరకు మంగళవారం ప్రమాదానికి కారణమైన ఏపీ రాష్ట్రంలోని కుక్కునూరు మండలం సీతానగరం గ్రామానికి చెందిన ద్విచక్రవాహనదారుడైన గణపతి రామకృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ.శ్రీనివాస్ తెలిపారు.

రిమాండ్‌కు నిందితుడు

ములకలపల్లి: మండలంలోని మాధారం శివారు జామాయిల్ తోటలో వివాహితను హత్య చేసిన ఘటనలో నిందితుడు, మృతురాలి భర్త ఆరెంపుల రాజేశ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు నిందితుడు రాజేశ్ స్థానిక గ్రామపెద్దల సమక్షంలో పాల్వంచ సీఐ మేడేపల్లి నాగరాజు ఆధ్వర్యంలో నేరం అంగీకరించి మంగళవారం పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781

కారం.. బేరం !


రైతు నుంచి కొనుగోలు చేసిన మిర్చి నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మం జిల్లాలో ఎస్‌హెచ్‌జీల ఆధ్వర్యాన మిర్చి కొనుగోళ్లు

- తొమ్మిది మండలాల్లో సేకరణ ప్రారంభం
- ఇప్పటివరకు 350 మెట్రిక్ టన్నులకు పైగా కొనుగోళ్లు పూర్తి
- గత సంవత్సరం స్ఫూర్తితో ఈ ఏడాదీ రంగంలోకి..


కాంటా వేసిన మిర్చిని లోడ్ చేస్తున్న దృశ్యం

ఖమ్మంమయూరిసెంటర్: ప్రభుత్వ ప్రోత్సాహంతో గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలు వ్యాపారాల్లో రాణిస్తున్నారు. బ్యాంక్ లింకేజీ రుణాలను వినియోగించుకుంటూ తమకు పట్టు ఉన్న రంగాల్లో పెట్టుబడులు పెట్టి సత్ఫలితాలు సాధిస్తున్నారు. ఇదే నేపథ్యాన రాష్ట్రంలోనే తొలిసారిగా గతేడాది ఖమ్మం జిల్లాలోని ఎస్‌హెచ్‌జీల సభ్యులతో నిర్వహించిన మిర్చి వ్యాపారం విజయవంతమైంది. మిర్చి వ్యాపారం ఇటు రైతులకు.. అటు కంపెనీ యజమానులతో పాటు మహిళా సంఘాలకు లాభాలను అందించింది. దీంతో ఖమ్మం జిల్లాలో ఈ ఏడాది కూడా మిర్చి వ్యాపారాన్ని మహిళా సంఘాల సభ్యులు ప్రారంభించారు. తొలి ఏడాది అనుకున్న దానికంటే మంచి ఫలితాలు రావడంతో ప్రభుత్వం కూడా ఫార్మర్ ప్రొక్యూర్‌మెంట్ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీఓ)లుగా ఏర్పడిన మహిళలను మరింత ప్రోత్సహిస్తోంది. ఈ మేరకు ఖమ్మంతో పాటు ఇతర జిల్లాల్లో కూడా ఈ ఏడాది మిర్చి కొనుగోలు చేయించాలని నిర్ణయించింది. అయితే మిర్చి సీజన్ ప్రారంభం నుంచి బహిరంగ మార్కెట్‌లో ధర అధికంగా ఉండడంతో రైతులు అటే మొగ్గు చూపారు. ఇక ఎఫ్‌పీఓలతో ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీల ప్రతినిధులు సైతం గత నెల వరకు వేచి ఉన్నారు. ఎట్టకేలకు గత నెల 25 నుంచి జిల్లాలో మిర్చి కొనుగోళ్లు మొదలుపెట్టారు.

అదనంగా నాలుగు మండలాలు..

గతేడాది మిర్చి కొనుగోళ్లు సత్ఫలితాలను ఇవ్వడం, మహిళా ఎఫ్‌పీఓలకు పంట విక్రయించేందుకు రైతులు ముందుకు రావడంతో అధికారులు ఈ ఏడాది వ్యాపారాన్ని విస్తరించాలని నిర్ణయించారు. గతేడాది ఐదు మండలాల పరిధిలో మిర్చి కొనుగోలు చేయగా ఈ సారి అదనంగా నాలుగు మండలాలు చేర్చారు. దీంతో సింగరేణి, కామేపల్లి, ఏన్కూరు, తల్లాడ, మధిర, తిరుమలాయపాలెం, కూసుమంచి, రఘునాథపాలెం, ముదిగొండ మండలాల పరిధిలో ఎఫ్‌పీఓలు వ్యాపారం చేయనున్నారు. ఇక మధిర, కొణిజర్ల, తిరుమలాయాలెం, సిరివెన్నెల ఎఫ్‌పీఓ సభ్యులు రైతుల నుంచి మిర్చి కొనుగోలు చేయడం, కంపెనీకి చేర్చడం, వారి నుంచి నగదు తీసుకొని రైతులకు ఇప్పించడం వంటి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

ఆలస్యంగా ప్రారంభం

ఈ ఏడాది జనవరిలోనే మిర్చి కొనుగోలు ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. కానీ బహిరంగ మార్కెట్‌లో మెరుగైన ధర ఉండడంతో రైతులు అటే మొగ్గు చూపగా మహిళా సంఘాలు వేచి చూడాల్సి వచ్చింది. జిల్లాలో గతేడాది 500 మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంతో ఎఫ్‌పీఓలు మిర్చి వ్యాపారాన్ని ప్రారంభించగా.. 2,147 మెట్రిక్ టన్నుల మిర్చి కొనుగోలు చేశారు. దీంతో ఈ ఏడాది లక్ష్యాన్ని 5 వేల మెట్రిక్ టన్నులకు పెంచారు. కానీ గతేడాది ఫిబ్రవరి 12వ తేదీనే మిర్చి కొనుగోలు ప్రారంభించగా.. ఈ ఏడాది మార్చి 25వ తేదీన కొనుగోలు ప్రారంభించారు. ఇప్పటివరకు 350 మెట్రిక్ టన్నుల మిర్చిని కొనుగోలు చేయగా.. రూ.6 కోట్ల వ్యాపారం చేశారు.

నేరుగా రైతుల వద్దకు వెళ్లి..

జిల్లాలోని మహిళా ఎఫ్‌పీఓలు మహబూబాబాద్ జిల్లా కురవి వద్ద ఉన్న ప్లాంట్ లిపిడ్ కంపెనీ సహకారంతో జిల్లాలో మిర్చి కొనుగోలు చేసి అక్కడికి తరలిస్తున్నారు. గ్రామాల్లో రైతుల వద్దకు మహిళలతో కలిసి కంపెనీ ప్రతినిధులు, అధికారులు వెళ్లి మిర్చిని పరిశీలిస్తున్నారు. ఆతర్వాత నాణ్యత నిర్ధారించి కొనుగోలు చేస్తున్నారు. కల్లాల వద్దే కాంటా వేయించి లారీల్లో లోడ్ చేయించి కంపెనీకి తరలిస్తున్నారు. ఆ తర్వాత కంపెనీ నుంచి డబ్బు రాగానే రైతులకు చెల్లించే బాధ్యతను మహిళలే నిర్వర్తిస్తున్నారు.

మిర్చి కొనుగోళ్లు ప్రారంభించారు..



మహిళా సంఘాల సభ్యులు జిల్లాలో మిర్చి కొనుగోలు ప్రారంభించారు. తొమ్మిది రోజుల్లో 350 మెట్రిక్ టన్నులకు పైగా మిర్చి సేకరించారు. ఈ ఏడాది కాస్త ఆలస్యమైంది. అయినా లక్ష్యానికి అనుగుణంగా మహిళా ఎఫ్‌పీఓలతో మిర్చి సేకరణ పూర్తిచేస్తాం.

– ఎం.విద్యాచందన, డీఆర్డీఓ

పొంగులేటి వర్గం ఆత్మీయ సమ్మేళనం


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

ఇల్లెందు: రానున్న కాలంలో ఏ పార్టీలోకి వెళ్తామా.. ఏ పార్టీలో ఉంటామా అన్నది ముఖ్యం కాదని, ఏ పార్టీ జెండా నీడన ఉన్నా ఇల్లెందులో కోరం కనకయ్యను ఎమ్మెల్యేగా గెలిపించుకోవటమే మన అజెండా అని పొంగులేటి శ్రీనివాసరెడ్డి వర్గం నాయకుడు తుళ్లూరి బ్రహ్మయ్య, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అన్నారు. మంగళవారం ఇల్లెందులోని కోరం కనకయ్య క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో వారు పాల్గొని ప్రసంగించారు. గ్రామ గ్రామాన పొంగులేటి – కోరం కనకయ్య వర్గాన్ని బలోపేతం చేయాలని సూచించారు. 2014లో కేవలం ఐదు వేల పైచిలుకు ఓట్లు ఉన్న బీఆర్‌ఎస్‌ను 60 వేలకు పెంచిన ఘనత కోరం కనకయ్యకు దక్కిందని, 2018లో బీఆర్‌ఎస్‌కు సరిపడా స్థానాలున్నా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించారని, బీఆర్‌ఎస్‌లో కష్టపడిన వారికి గుర్తింపు లేకుండా పోయిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పాయం లలిత, పాయం స్వాతి, పూనెం కవిత, తాటి చుక్కమ్మ, సూర్జపాక రామయ్య, మూతి వెంకటనర్సయ్య, ఎంపీటీసీ సభ్యులు మండల రాము, పూనెం సురేందర్, పాయం కృష్ణప్రసాద్, తాటి యశోద, బియ్యాని సుధాకర్, ఉప సర్పంచ్‌లు నెల్లి నర్సింహారావు, తాటి రాంబాబు, కుర్రా అరుణ, నాయకులు తాటి భిక్షం, ముక్తి కృష్ణ, సూర్జబాక సత్యనారాయణ, నాగార్జున్, బింగి కృష్ణ, దేవానాయక్ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: టేకులపల్లిలో నిర్వహించిన సమ్మేళనంలో పూనెం సురేందర్, పూనెం ఉమ, బోడ నిరోష, అజ్మీర బుజ్జి, మోకాళ్ల రమాదేవి, మాడె మధు, యదళ్లపల్లి బాబు, పాయం సమ్మయ్య, ఈసం హనుమంతు, ఊకె నర్సమ్మ, పూనెం రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు బాణోతు సరోజిని, బాణోతు పూర్ణ, ఉండేటి ప్రసాద్, అజ్మీర శివ, మోకాళ్ల పోశాలు, ఈది గణేశ్, సర్దార్, బోడ మంగీలాల్, బాణోతు రవి, వీరభద్రం, బుర్ర ధర్మయ్యగౌడ్, భద్రు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలో డీసీహెచ్‌ఎస్ తనిఖీ


రోగులతో మాట్లాడుతున్న డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబు

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలను డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జి.రవిబాబు తనిఖీ చేశారు. మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన అన్ని వార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్యం, సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. రోగుల సంఖ్యకు తగిన విధంగా వార్డులు, సదుపాయాలు లేవని రోగులు ఆయన దృష్టికి తీసుకురాగా ప్రత్యేక వైద్యులు ఉన్నా వారికి తగిన పరికరాలు లేకపోవటం వల్ల సరైన వైద్యం అందటం లేదని గ్రహించారు. వైద్య విధాన పరిషత్‌లోకి మారిన తర్వాత స్పెషలిస్టు వైద్యులను నియమించినప్పటికీ వైద్యం అందించేందుకు అవసరమైన పరికరాలు సమకూర్చేందుకు టెండర్ ప్రక్రియ కొలిక్కి వచ్చిందని తెలిపారు. ఇక్కడి రోగులకు ప్రతీ రోజు ఆహారం అందించే వంట ఏజెన్సీ సక్రమంగా ఆహారం అందించటం లేదని, ఆ ఏజెన్సీ పనితీరు బాగా లేనందున రద్దు కోసం తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. సూపరింటెండెంట్ శిరీశ్, ఆర్‌ఎంఓ హర్షవర్ధన్, ఇతర డాక్టర్లు, సిబ్బంది ఉన్నారు.

దుమ్ముగూడెం తహసీల్దార్ సస్పెండ్

దుమ్ముగూడెం: ఏజెన్సీలో భూమి బదలాయింపు ఉల్లంఘిస్తూ గిరిజనేతరులకు పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేసిన అంశంపై దుమ్ముగూడెం తహసీల్దార్ కె.చంద్రశేఖర్‌రావును విధుల నుంచి తొలగిస్తూ జిల్లా కలెక్టర్ అనుదీప్ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలో 18 మంది గిరిజనేతరులకు పట్టదారు పాస్ పుస్తకాలు జారీ చేయడంతో గతంలో ఇతనిపై ప్రజా ప్రతినిధులు, ప్రజలు ఫిర్యాదు చేశారు. ఏజెన్సీలో అమలులో ఉన్న చట్టాలను కాలరాసి తన ఇష్టానుసారంగా గిరిజనేతరులకు పట్టాలు జారీ చేసినందున ఈ చర్యలు చేపట్టారు. సస్పెండ్ చేసిన చంద్రశేఖర్‌రావును భద్రాచలం ఆర్డీఓ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని, సస్పెన్షన్ అమలులో ఉన్నకాలంలో అనుమతి లేకుండా కార్యస్థానం విడిచి వెళ్లొద్దని కలెక్టర్ ఆదేశించారు.

మూడు నెలలు జైలు

ఇల్లెందురూరల్: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం కేసులో మండలంలోని మర్రిగూడెం గ్రామ పంచాయతీ ఏడుప్పలగూడెం గ్రామానికి చెందిన రవీందర్‌కు మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ ఇల్లెందు మెజిస్ట్రేట్ ముకేశ్ మంగళవారం తీర్పు నిచ్చారు. మండలంలోని కొమరారం, పోచారం గ్రామపంచాయతీల పరిధిలో నాలుగు నెలల కిందట రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని రాగి తీగను అపహరించిన కేసులో రవీందర్‌పై కొమరారం ఎస్‌ఐ శివరామకృష్ణ కేసు నమోదు చేశాడు.

రోడ్డుపై నడుస్తున్న యువకుడిని ఢీకొట్టిన బైక్

- అనంతరం అదే బైక్‌పై పరార్

నేలకొండపల్లి: రహదారి వెంట స్నేహితులతో కలిసి నడిచి వెళ్తున్న ఓ యువకుడిని.. బైక్‌పై అతివేగంగా వచ్చిన ఓవ్యక్తి ఢీకొట్టి పరారైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని కొరట్లగూడెం గ్రామానికి చెందిన బచ్చలకూరి ఉపేందర్ (18) అతని స్నేహితులు సోమ వారం రాత్రి కూసుమంచి – నేలకొండపల్లి ప్రధాన రహదారిపై ఫ్యాక్టరీ వైపు నడిచి వెళ్తున్నారు. అదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై అతివేగంగా వచ్చి ఉపేందర్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. దీంతో ఉపేందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సహచరులు వెంటనే బైక్‌పై నేలకొండపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొచ్చి ప్రథమ చికి త్స చేయించారు. పరిస్థి తి విషమంగా ఉండటంతో 108 ద్వారా ఖమ్మం తరలించారు. ప్రస్తుతం ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు.

హైదరాబాద్‌లో కొత్తగూడెం విద్యార్థిని ఆత్మహత్య


ప్రియాంక మృతదేహం

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి పంచాయతీకి చెందిన ఇంటర్ విద్యార్థిని ప్రియాంక హైదరాబాద్‌లోని కాలేజీ బిల్డింగ్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం రాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి. లక్ష్మీదేవిపల్లి పంచాయతీకి చెందిన పెనుమళ్ల ప్రభాకర్, సుశీల దంపతుల కుమార్తె ప్రియాంక నీట్ కోచింగ్ కోసం హైదరాబాద్‌కు వెళ్లింది. హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లో ఉన్న ఎక్సెల్ కాలేజీలో చేరి.. అక్కడే హాస్టల్‌లో ఉంటోంది. చదువులో తీవ్ర ఒత్తిడికి గురై సోమవారం రాత్రి పది గంటల సమయంలో హాస్టల్‌లోని నాలుగో అంతస్తు నుంచి దూకింది. తోటి విద్యార్థులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి ప్రియాంకను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిన్నట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అయితే, సూసైడ్ నోట్ ప్రియాంక మృతిచెందిన ప్రదేశంలో ఉన్నట్లు తెలిసింది. కానీ, అందులో ఏం ఉందో తెలియరాలేదు.

ఆర్థిక ఇబ్బందులతో ట్యాంకర్ డ్రైవర్..


భూక్య దేవ్‌సింగ్ (ఫైల్)

టేకులపల్లి: ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ట్యాంకర్ డ్రైవర్ ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటన మండలంలో జరిగింది. టేకులపల్లి ఎస్‌ఐ రమణారెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని దాసుతండా పంచాయతీ సింగ్యతండాకు చెందిన భూక్య దేవ్‌సింగ్ (35) కోయగూడెం ఓపెన్‌కాస్టులో ప్రైవేట్ కాంట్రాక్టర్ వద్ద ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆర్థిక సమస్యల కారణంగా మనస్తాపానికి గురై మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య సుశీల, పాప, బాబు (కవలపిల్లలు) ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని యువకుడు..

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం చోటు చేసుకుంది. భగవాన్‌దాస్‌కాలనీకి చెందిన సునీల్ (27) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కి ఉరి వేసుకున్నారు. గమనించిన కుటుంబ సభ్యులు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిన్నట్లు వైద్యులు తెలిపారు. మృతుడు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

పురుగు మందు తాగి వృద్ధురాలు..

అన్నపురెడ్డిపల్లి: పురుగులమందు తాగి వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. మండలంలోని కట్టుగూడెం గ్రామానికి చెందిన కట్ల కమలమ్మ (72) అనారోగ్యంతో బాధపడుతోంది. మంగళవారం ఉదయం పురుగులమందు సేవించడంతో కుటుంబ సభ్యులు కొత్తగూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ షాహీన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాపురంలో చిచ్చుపెట్టిన మద్యం

- తొలుత మద్యానికి బానిస.. ఆపై భార్యపై అనుమానం
- మొన్న అర్ధాంగిని హత్య చేసిన వ్యక్తి
- నిన్న మంగళగిరిలో రైలుకింద పడి ఆత్మహత్య
- తల్లిదండ్రులిద్దరినీ కోల్పోయి కన్నీరుమున్నీరవుతున్న సంతానం


పిల్లలు ప్రణవ్, అశ్వితతో దేవమణి - రాంబాబు (ఫైల్)

ఖమ్మంక్రైం/తల్లాడ: ఒక వ్యక్తిని.. ఓ కుటుంబాన్ని మద్యం ఎలా చిన్నాభిన్నం చేస్తుందో చెప్పడానికి ఇది మరో ఉదాహరణ. తొలుత మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆ తర్వాత భార్యపై అనుమానం పెంచుకుని కిరాతకంగా హత్య చేశాడు. ఆపై పోలీసులకు పట్టుబడతాననే భయంతో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సదరు వ్యక్తి తనకు తాను శిక్ష విధించుకున్నాడని అనుకున్నా.. వారి ఇద్దరు పిల్లలు మాత్రం ఇప్పుడు తల్లిదండ్రులను కోల్పోయి దిక్కుతోచని స్థితి ఎదుర్కొంటున్నారు.

సమీప బంధువులే..

తల్లాడ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఇనుపనూరి రాంబాబు ఖమ్మంలో ఉంటూ తాగునీరు సరఫరా చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన అక్క కుమార్తె, వైరా మండలం స్టేజీ పినపాకకు చెందిన దేవమణిని వివాహం చేసుకున్నాడు. పెళ్లయిన కొద్దికాలానికే మద్యానికి బానిసైన రాంబాబు తరచూ భార్యను వేధించేవాడు. ఇంతలోనే ఇద్దరు సంతానం కలగగా, దేవమణికి ఆర్టీసీ కండక్టర్‌గా ఉద్యోగం వచ్చింది. దీంతో ఆమె పిల్లలతో సహా ఖమ్మం మామిళ్లగూడెంలో నివసించసాగింది. అయినప్పటికీ రాంబాబు అనుమానంతో చేస్తున్న వేధింపులు ఆగకపోగా.. ఆదివారం రాత్రి ఆమె ఉంటున్న ఇంటికి వచ్చిన రాంబాబు చేతులు వెనక్కి విరిచి తలపై రోకలిబండతో మోది దారుణంగా హత్య చేశాడు.

వెంటాడిన భయం

ఆదివారం రాత్రి దేవమణిని హత్య చేసిన రాంబాబు అక్కడి నుంచి పారిపోయాడు. దీంతో సోమవారం ఉదయం పోస్టుమార్టం అనంతరం ఆమె మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. మరోపక్క రాంబాబు కోసం పోలీసులు గాలిస్తుండడంతో ఎలాగైనా అరెస్టు తప్పదని భావించిన ఆయన సోమవారమే ఖమ్మంలో రైలు ఎక్కి విజయవాడలో దిగినట్లు తెలిసింది. ఆతర్వాత మంగళవారం ఉదయం గుంటూరు జిల్లా మంగళగిరి ప్రాంతంలో రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన వద్ద ఉన్న ఆధారాల ప్రకారం రాంబాబుగా గుర్తించిన పోలీసులు మృతదేహాన్ని మంగళగిరి మార్చురీలో భద్రపరిచి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు.

నాలుగు రోజులు ఆగితే బతికేదేమో...

భర్త రాంబాబు వేధింపులు భరించలేక దేవమణి కొన్నాళ్ల క్రితం విడాకులకు దరఖాస్తు చేసుకుంది. దీంతో కేసు విచారణ కొనసాగుతుండగా.. గతనెల 31వ తేదీన విచారణకు హాజరైనట్లు తెలుస్తోంది. ఈనెల 6వ తేదీకి కేసు వాయిదా పడగా ఆ రోజు విడాకులు మంజూరయ్యే అవకాశమున్నట్లు సమాచారం. అదే జరిగితే రాంబాబు ఆమెకు దూరంగా ఉండేవాడని.. తద్వారా ఆమె పిల్లలతో కలిసి ఉన్నదాంట్లో సర్దుకుంటూ జీవించే అవకాశముండేదని చెబుతున్నారు. ఇంతలోనే దేవమణి హత్యకు గురికావడం.. ఆపై రాంబాబు ఆత్మహత్య చేసుకోవడం గమనార్హం.

కుటుంబం చిన్నాభిన్నం..

దేవమణి – రాంబాబు దంపతులకు ప్రణవ్ తేజ, అశ్విత సంతానం. ఇందులో ప్రణవ్ ప్రైవేట్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఉంటూ పదో తరగతి చదువుతుండగా, అశ్విత తల్లితో ఉంటూ ఎనిమిదో తరగతి చదువుతోంది. సోమవారం నుంచి ప్రణవ్‌కు వార్షిక పరీక్షలు ఉండడంతో ఆదివారం హాస్టల్‌కు వెళ్లిన దేవమణి పరీక్షలు బాగా రాయాలని ధైర్యం చెప్పి వచ్చింది. ఆపై ఆదివారం అర్ధరాత్రి ఆమె హత్యకు గురికావడంతో కుమారుడికి విషయం చెప్పకుండా సోమవారం పరీక్ష పూర్తయ్యాకే చెప్పారు. కాగా, తల్లి అంత్యక్రియలు పూర్తయ్యాక మంగళవారం హిందీ పరీక్షకు కూడా ప్రణవ్ సుడులు తిరుగుతున్న కన్నీళ్లతోనే హాజరయ్యాడు. ఆ పరీక్ష ముగిసేలోగా తండ్రి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం అందడంతో అటు ప్రణవ్, ఇటు అశ్విత కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. తండ్రి చేసిన పనికి తల్లిని కోల్పోవడమే కాక.. ఇప్పుడు తండ్రి కూడా దూరం కావడంతో పిల్లలిద్దరూ తమకు దిక్కెవరని చేస్తున్న రోదనలు మిన్నంటాయి.

భూ కబ్జాదారులపై కేసు నమోదు

చుంచుపల్లి: భూమి కబ్జా చేసినవారిపై కేసు నమోదైన ఘటన మంగళవారం మండలంలో జరిగింది. చుంచుపల్లి ఎస్‌ఐ సుమన్ కథనం ప్రకారం.. చుంచుపల్లి మండలం రామాంజనేయకాలనీలో పదవీ విరమణ చేసిన సైనికుల కోసం ఇచ్చిన స్థలాన్ని ఇటీవల కొందరు ఆక్రమణకు పాల్పడ్డారు. స్థానికుల ద్వారా ఈ విషయం తెలుసుకున్న భూ యజమానులు హుటాహుటిన అక్కడకు వచ్చే సరికి అప్పటికే వారి భూమిలో ఉన్న గోడను కూల్చి కబ్జా చేసేందుకు కొందరు యత్నిస్తున్నారు. దీంతో యజమానులు వారిని నిలదీశారు. కబ్జాకి పాల్పడుతున్న వ్యక్తులు ఈ భూమి తమదేనని, తమవద్ద అన్ని పత్రాలు, ఆధారాలు ఉన్నాయంటూ నమ్మబలికి దాడికి యత్నించగా గమనిస్తున్న స్థానికులు ఘటనా స్థలానికి వచ్చే సరికి కబ్జాదారులు అక్కడి నుంచి పారిపోయారు. ఈ భూమి అసలు యజమాని ఆర్.చందర్‌రావు కుమారుడు శ్రీనివాస్ తన వద్ద ప్రభుత్వం నుంచి తనకు హక్కుగా సంక్రమించిన అసలు పత్రాలతో చుంచుపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు మంగళవారం చుంచుపల్లి ఎస్‌ఐ సుమన్ నిందితులైన కబీర్‌దాస్, రంగ, సరోజిని, తుమ్మ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మందుబాబుల వీరంగం

కారేపల్లి: కారేపల్లిలో మందుబాబులు వీరంగం సృష్టించారు. మంగళవారం సాయంత్రం అంబేడ్కర్ సెంటర్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులను దుర్భాషలాడుతూ కానిస్టేబుల్‌పై దాడికి పాల్పడ్డారు. స్థానిక యువకులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. మండలంలోని గిద్దెవారిగూడెం గ్రామానికి ఈసం కిశోర్, కల్తీ వినోద్, వజ్జా అప్పారావు, పాయం వెంకటేశ్వర్లు అంబేడ్కర్ సెంటర్‌లోని వైన్ షాపులో అతిగా మద్యం సేవించి రెండు ద్విచక్రవాహనాలపై వస్తున్నారు. ఈ క్రమంలో ఎస్‌ఐ రామారావు, కానిస్టేబుళ్లు సీతారాములు, కిరణ్ వారి వాహనాన్ని ఆపి డ్రంక్ అండ్ డ్రైవ్ చేసేందుకు ఉపక్రమించారు. ఈ క్రమంలో పోలీసులను దుర్భాషలాడుతూ కానిస్టేబుల్ సీతారాములుపై ఊహించని విధంగా దాడికి పాల్పడ్డారు. అక్కడే ఉన్న పోలీసులు, స్థానిక యువకులు వారిని వారించే ప్రయత్నం చేయగా.. స్థానిక యువకులపై సైతం దాడికి యత్నించారు. వెంటనే స్థానికులు మందుబాబులకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్‌తోపాటు పోలీసులను దుర్భాషలాడి, వారి విధులను ఆటంకపరచటంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.



గరుడవాహనంపై కోదండరాముడు

ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలోని శ్రీకోదండరామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఐదోరోజు మంగళవారం కోదండరాముడు మోహినీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 8 నుంచి 9:30 గంటల వరకు గరుడ వాహనంపై కొలువుదీరిన శ్రీరామచంద్రుడిని చూసి భక్తు లు జయజయ ధ్వానాలు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీరామచంద్రుడు బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు శివధనుర్భంగాలంకారంలో భక్తులకు దర్శనం ఇస్తారు. రాత్రి 8 నుంచి 10 గంటల వరకు పున్నమి వెన్నెలలో శ్రీసీతారాముల కల్యాణోత్సవం జరగనుంది.

కలసి నడుద్దాం.. ఘన విజయం సాధిద్దాం

- ప్రాంతీయ సమన్వయకర్తల సమావేశంలో సీఎం జగన్



సాక్షి, అమరావతి: ఎన్నికలకు మరో ఏడాది మాత్రమే సమయం ఉందని, సమన్వయంతో అంతా కలసి పనిచేయడం ద్వారా ఘనవి జయం సాధిద్దామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీ ప్రాంతీయ సమన్వయకర్తలకు దిశానిర్దేశం చేశారు. మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ప్రాంతీయ సమన్వయకర్తలతో సమావేశమైన సీఎం జగన్ పార్టీ పరంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై మార్గనిర్దేశం చేశారు. ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే సరిదిద్ది అందర్నీ ఒక్క తాటిపైకి తేవాలని సూచించారు. పార్టీ సమన్వయకర్తలుగా తనతో ఏ విషయాన్నైనా చర్చించవచ్చని, ఎప్పుడైనా కలవవచ్చన్నారు. 'పార్టీ పరంగా మీరు నా టాప్ టీమ్' అని పేర్కొన్నారు. 'మీరు, నేను, పార్టీ యంత్రాంగం అంతా కలిసి ముందుకుసాగితే ఎన్నికల్లో విజయభేరి మోగించడం తథ్యం' అని సీఎం జగన్ పేర్కొన్నారు.

రాజధానిలో పేదలు ఉండొద్దంటే ఎలా?

రాజధాని పిటిషనర్లను ప్రశ్నించిన ఏపీ హైకోర్టు ధర్మాసనం

- ఇళ్ల స్థలాల కేటాయింపు అభివృద్ధిలో భాగమే
- ఫలానా వారికి ఇళ్ల స్థలాలివ్వొద్దని చెప్పజాలరు
- ఈ వ్యాజ్యాలు అపరిపక్వమైనవే..
- జీవో 45పై ఏ రకంగానూ జోక్యం చేసుకోలేం
- ప్రభుత్వం తీసుకునే ప్రతీ నిర్ణయంపై హైకోర్టును ఆశ్రయిస్తున్నారు



సాక్షి, అమరావతి: ''రాజధానిలో పేదలు ఉండకూడదంటే ఎలా?'' అని ఏపీ హైకోర్టు ధర్మాసనం అమరావతి రైతులను ప్రశ్నించింది. రాజధాని ప్రాంతంలో రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడం అభివృద్ధిలో భాగమని వ్యాఖ్యానించింది. ఫలానా వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వొద్దని చెప్పజాలరని స్పష్టం చేసింది. రాజధాని భూములు ప్రస్తుతం సీఆర్‌డీఏవేనని, అంతేకానీ భూములిచ్చిన వారివి కాదని పేర్కొంది. రాజధాని వ్యవహారం సుప్రీంకోర్టు పరిధిలో ఉన్నందున అందుకు సంబంధించిన వ్యవహారంలో తాము జోక్యం చేసుకుని పరిస్థితిని జటిలం చేయలేమని తెలిపింది. పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు వీలుగా రాజధాని ప్రాంతంలో 1,134 ఎకరాలను ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల కలెక్టర్లకు బదలాయించాలని సీఆర్‌డీఏ కమిషనర్‌ను ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 45 విషయంలో ఏ రకంగానూ జోక్యం చేసుకోలేమని తెలిపింది. ప్రస్తుత దశలో స్టే విధించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. భూములను కలెక్టర్లకు బదలాయించాలని మాత్రమే ప్రభుత్వం చెప్పిందని, అందువల్ల కేటాయింపులను ప్రశ్నిస్తూ దాఖలైన వ్యాజ్యాలు అపరిపక్వమైనవని స్పష్టం చేసింది. ప్రభుత్వం తీసుకునే ప్రతీ నిర్ణయంపై హైకోర్టును ఆశ్రయిస్తున్నారని వ్యాఖ్యానించింది. రాజధాని విషయంలో కొన్ని అంశాలను హైకోర్టులో, కొన్నింటిని సుప్రీంకోర్టులో సవాల్ చేస్తున్నారని ప్రస్తావిస్తూ జీవో 45పై కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చని పేర్కొంది. నిర్ణయాలు తీసుకోకుండా ప్రభుత్వాన్ని నిరోధించలేమని, జీవో 45పై పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని పురపాలక శాఖ, సీఆర్‌డీఏలను న్యాయస్థానం ఆదేశించింది. ప్రభుత్వ కౌంటర్‌ను పరిశీలించిన తరువాతే మధ్యంతర ఉత్తర్వుల జారీ విషయాన్ని పరిశీలిస్తామని స్పష్టం చేస్తూ విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ మంతోజు గంగారావు ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది.

పేదలకు ఇళ్ల స్థలాలపై పిటిషన్లు..

రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాల నిమిత్తం 1,134 ఎకరాల భూమిని ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల కలెక్టర్లకు బదిలీ చేసేందుకు అనుమతినిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 45ను సవాల్ చేస్తూ అమరావతి రైతులు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు దామా శేషాద్రి నాయుడు, ఉన్నం మురళీధరరావు, దేవ్‌దత్ కామత్, వీఎస్‌ఆర్ ఆంజనేయులు తదితరులు వాదించారు. ఇళ్ల స్థలాల నిమిత్తం గతంలో జారీ చేసిన జీవోను హైకోర్టు నిలుపుదల చేసిందని మురళీధరరావు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. తరువాత సీఆర్‌డీఏ చట్టానికి సవరణలు చేసి ఆర్ 5 జోన్ తెచ్చారన్నారు. ఈ సమయంలో ధర్మాసనం స్పందిస్తూ ఇళ్ల స్థలాల కేటాయింపు తమ తుది ఉత్తర్వులకు లోబడి ఉండేలా ఆదేశాలు ఇస్తామని పేర్కొనగా దీన్ని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వ్యతిరేకించారు. రాజధాని భూములను అన్యాక్రాంతం చేయడం, బదలాయించడం, థర్డ్ పార్టీ హక్కులు సృష్టించడం చేయరాదని హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం తీర్పునిచ్చిందన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా 3 అంశాలపైనే స్టే విధించిందన్నారు. మిగిలిన అంశాల విషయంలో హైకోర్టు తీర్పు అమల్లోనే ఉందని నివేదించారు.

పరిస్థితిని జటిలం చేయలేం..

దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. రాజధాని ప్రజలందరిదని, అది ఏ వ్యక్తిదో, వర్గానిదో కాదని స్పష్టం చేసింది. రాజధానిపై సుప్రీంకోర్టు విచారణ జరుపుతున్న నేపథ్యంలో జీవో 45 విషయంలో జోక్యం చేసుకుని పరిస్థితిని జటిలం చేయలేమని తేల్చి చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వమే సమస్యను జటిలం చేస్తోందంటూ పిటిషనర్ల న్యాయవాది దేవ్‌దత్ కామత్ సుప్రీంకోర్టు ఉత్తర్వులను చదివి వినిపించడంతో... సుప్రీంకోర్టు ఉత్తర్వులకు తమను భాష్యం చెప్పమని కోరుతున్నారా? అని ధర్మాసనం ప్రశ్నించింది. కావాలంటే సుప్రీంకోర్టుకే వెళ్లాలని స్పష్టం చేసింది. రాజధాని విషయంలో హైకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం ఉల్లంఘిస్తోందని పిటిషనర్ల న్యాయవాదులు పేర్కొనగా దానిపై ఇప్పటికే కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలైందని ధర్మాసనం తెలిపింది.

జరగని కేటాయింపులపై వ్యాజ్యాలేమిటి?

ఈ వ్యాజ్యాలను ఇప్పటికిప్పుడు విచారించాల్సినంత అత్యవసరం ఏముందో చెప్పాలని పిటిషనర్లను ధర్మాసనం ప్రశ్నించింది. ప్రతిదీ అత్యవసరమంటూ పిటిషన్లు దాఖలు చేయడాన్ని తాము ఎంత మాత్రం హర్షించబోమని, తమను ఒత్తిడి చేయవద్దని తేల్చి చెప్పింది. ఇళ్ల స్థలాల కేటాయింపులు తమ తుది ఉత్తర్వులకు లోబడి ఉంటాయని, ఈ దశగా ఉత్తర్వులు ఇస్తామని ధర్మాసనం పునరుద్ఘాటించింది. ముఖ్యమంత్రి ఓ సమావేశం నిర్వహించి పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని అధికారులను ఆదేశించారని, అందువల్లే జీవోపై స్టే కోరుతున్నామని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు నివేదించారు. 'ప్రభుత్వం పని చేయాల్సిందే కదా. నిర్ణయాలు తీసుకోకుండా ఎలా నిరోధించగలం? అసలు ఈ వ్యాజ్యాలు అపరిపక్వమైనవి. ప్రభుత్వం భూములను కలెక్టర్లకు బదలాయించాలని మాత్రమే చెప్పింది. కేటాయింపులు ఇంకా జరగలేదు. జరగని కేటాయింపులపై వ్యాజ్యాలు దాఖలు చేయడం ఏమిటి? ప్రభుత్వాన్ని కౌంటర్ దాఖలు చేయనివ్వండి. ఆ తరువాత ఏం చేయాలో చూద్దాం ...'అని ధర్మాసనం స్పష్టం చేసింది.

ఒత్తిడి చేసి మధ్యంతర ఉత్తర్వులు పొందలేరు..

ఈ సమయంలో సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు స్పందిస్తూ థర్డ్ పార్టీలకు భూములు కేటాయిస్తే విషయం జటిలం అవుతుందన్నారు. తదుపరి దాఖలు చేసే వ్యాజ్యాల్లో వారందరినీ ప్రతివాదులుగా చేయాల్సి ఉంటుందని, అది ఆచరణ సాధ్యం కాదన్నారు. పిటిషనర్లు రైతులని, ఇళ్ల స్థలాల కేటాయింపు వల్ల వారి హక్కులు ప్రభావితం అవుతాయన్నారు. దీనిపై ధర్మాసనం అభ్యంతరం తెలిపింది. ఇవి ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు కావని, అందరి తరఫున వ్యాజ్యాలు వేసి జీవో మొత్తాన్ని నిలుపుదల చేయాలని కోరలేరని ధర్మాసనం తేల్చి చెప్పింది. ఇళ్ల స్థలాల కేటాయింపు వల్ల ఇతరులు కూడా లబ్ధి పొందుతున్నారని గుర్తు చేసింది. ప్రస్తుత దశలో జీవో 45 విషయంలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయబోమని తేల్చి చెప్పింది. అపరిపక్వమైన వ్యాజ్యాల్లో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం సాధ్యం కాదంది. ఒత్తిడి చేసి మధ్యంతర ఉత్తర్వులు పొందలేరని వ్యాఖ్యానించింది. రైతులకు స్థలాలు ఇవ్వకుండా ఇతరులకు ఇళ్ల స్థలాలివ్వడం చట్ట విరుద్ధమని సీనియర్ న్యాయవాది ఆంజనేయులు వాదించారు.

ఇన్‌సైడర్స్.. అవుట్ సైడర్స్ ఏమిటి?

సీనియర్ న్యాయవాది మురళీధరరావు వాదనలు వినిపిస్తూ మే మొదటి వారంలో ఇళ్ల స్థలాలివ్వాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు పత్రికల్లో వచ్చిందన్నారు. అవుట్‌సైడర్స్‌కు (రాజధానేతరులు) ఇళ్ల స్థలాలిస్తూ వివాదాలు సృష్టించేందుకు ప్రభుత్వం ప్రయతిస్తోందని పేర్కొనడంపై ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. రాజధాని ప్రజలందరిదీ, కేవలం పూలింగ్ కింద భూములిచ్చిన వారిది మాత్రమే కాదని పేర్కొంది. అవుట్ సైడర్స్, ఇన్‌సైడర్స్ అంటూ మాట్లాడొద్దని సూచించింది. రాజధాని భూములను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఇళ్ల స్థలాల కేటాయింపు ద్వారా అదే జరుగుతోందని తెలిపింది.

విచారణపై స్టే ఇవ్వలేం

మార్గదర్శి పిటిషన్‌లో తెలంగాణ హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి విషయంలో ఏపీ సీఐడీ విచారణపై స్టే ఇవ్వలేమని, దర్యాప్తు కొనసాగించుకోవచ్చని తెలంగాణ హైకోర్టు స్పష్టంచేసింది. అయితే, తాము తదుపరి ఆదేశాలిచ్చే వరకు 30 మంది మేనేజర్లపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని ఏపీ సర్కార్‌ను ఆదేశించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు వెలువరుస్తూ తదుపరి విచారణను ఈ నెల 20వ తేదీకి వాయిదా వేసింది. ఖాతాదారుల నుంచి వసూలు చేసిన నిధులను చట్ట విరుద్ధంగా అక్రమ మార్గాలకు మళ్లిస్తున్నారని పేర్కొంటూ ఏపీ సీఐడీ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే, ఈ కేసుల్లో తమపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీచేయాలని కోరుతూ మార్గదర్శి చైర్మన్ రామోజీరావు (ఏ1), ఎండీ శైలజ (ఏ2) ఇటీవల తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు.. దర్యాప్తులో భాగంగా విచారణకు రావాలని 30 మంది మార్గదర్శి మేనేజర్లకు సీఐడీ తాజాగా నోటీసులు జారీచేసింది. ఈ నోటీసులను సవాల్ చేస్తూ రామోజీరావు, శైలజ మంగళవారం ఇంటర్లొక్యుటరీ అప్లికేషన్‌ను లంచ్ మోషన్‌గా దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ బి. విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ.. ఉద్యోగులకు జారీచేసిన నోటీసులను కొట్టేయాలన్నారు. మార్గదర్శి కేసు దర్యాప్తును మరో రాష్ట్రానికి బదిలీచేసి.. స్వతంత్ర ఏజెన్సీకి అప్పగించేలా ఆదేశాలు జారీచేయాలని కోరారు.

పిటిషన్లు దాఖలు చేస్తూనే ఉన్నారు..

ఏపీ ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ గోవింద్‌రెడ్డి వాదనలు వినిపించారు. 'గత విచారణ సందర్భంగా హైకోర్టు కేవలం రామోజీ, శైలజకు మాత్రమే ఉపశమనం కలిగించింది. ఇతరులకు ఈ ఇది వర్తించదు. దర్యాప్తు ప్రారంభమైన నాటి నుంచి పిటిషనర్లు పిటిషన్లు దాఖలు చేస్తూనే ఉన్నారు. ఏపీ ప్రభుత్వానికి సమయం ఇవ్వకుండానే పిటిషనర్లకు అనుకూలంగా ఆదేశాలు జారీ అవుతున్నాయి. ఈ కేసులో ఏపీ అడ్వొకేట్ జనరల్ హాజరై వాదనలు వినిపిస్తారు. ఏపీ వాదన విన్న తర్వాతే మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాలి. అప్పటివరకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వొద్దని విజ్ఞప్తి చేస్తున్నా. ఏపీ సీఐడీ నుంచి నోటీసులు అందుకున్న ఉద్యోగులు ఎవరో, ఎప్పుడు నోటీసులు అందుకున్నారో.. లాంటి వివరాలు ఏమీలేకుండానే పిటిషన్ వేశారు. వివరాలు తెలీకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం సరికాదు. మార్గదర్శి నిధులను మ్యూచువల్ ఫండ్స్, షేర్స్‌లోకి మళ్లించడం ద్వారా భారీ కుంభకోణానికి పాల్పడింది. కౌంటర్ దాఖలు చేసే వరకైనా మాకు సమయం ఇవ్వాలి' అని గోవింద్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

దర్యాప్తును అడ్డుకోవడం లేదుకదా..

'మీకు (ఏపీ సర్కార్) అభ్యంతరం ఉంటే రేపే వెకేట్ స్టే పిటిషన్ వేయండి. హౌస్‌మోషన్ మూవ్ చేయండి.. మా ఆదేశాల సవరణకు పిటిషన్ వేయండి.. విచారణ చేపట్టడానికి మాకెలాంటి అభ్యంతరంలేదు. మేం దర్యాప్తును అడ్డుకోవడంలేదు కదా. మా ఆదేశాలపై అభ్యంతరాలు వ్యక్తంచేయడం సరికాదు'.. అని న్యాయమూర్తి పేర్కొన్నారు. తదుపరి విచారణను ఈనెల 20కి వాయిదా వేశారు.

రామోజీ అతీతుడా!?

▶ మొదటి పేజీ తరువాయి

కంపెనీకి చెందిన ఓ సీఏను అరెస్టు చేస్తే అందుకు నేను బాధ్యుడినా? అది అందరు సీఏలపై దాడి ఎలా అవుతుంది? అరెస్టులకు సంబంధించి విజయవాడలో సీఏలు సమావేశం పెట్టి సీఎం జగన్‌కు వ్యతిరేకంగా ఎందుకు మాట్లాడటంలేదని దూషించడం తగదు'.. అని ఉండవల్లి అన్నారు. సీఏలు ప్రభుత్వానికి ప్రతినిధుల్లాంటి వారని, వాళ్లు తప్పు చేస్తే శిక్షలు ఉంటాయని గుర్తుచేశారు. సత్యం రామలింగరాజు కేసులో సీఏలను అరెస్టుచేసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. కానీ, అప్పట్లో సీఏలు ఇలా మీటింగ్ పెట్టి విమర్శించిన దాఖలాల్లేవన్నారు. సీఏలు మీటింగ్ పెట్టి ఆహ్వానిస్తే వెళ్లి రామోజీ తప్పుచేశారన్న తన వాదన నిజామా? కాదో వివరిస్తానన్నారు.

నా కేసు తప్పని జస్టిస్ రమణతో చెప్పించండి

ఇక మార్గదర్శిపై తాను వేసిన కేసు తప్పని సుప్రీంకోర్టు మాజీ సీజే జస్టిస్ రమణతో చెప్పిస్తే చాలని ఉండవల్లి అన్నారు. రామోజీరావు చేసింది తప్పా కాదా? అని మాత్రమే సమాధానమివ్వాలన్నారు. తప్పని తేలితే రూపాయి ఫైన్ వేసినా సంతోషమేనని, మిగిలిన చిట్‌ఫండ్‌లకు భయం ఉంటుందన్నారు. సెక్షన్ 477–ఏ ప్రకారం అకౌంట్స్ తారుమారు చేస్తే శిక్ష తప్పదని.. రామోజీరావుకు డిపాజిటర్ల పేర్లు విడుదల చేయాలని ఉండవల్లి డిమాండ్ చేశారు. అవినీతిని ప్రశ్నిస్తే రామోజీరావు పత్రికా స్వేచ్ఛపై దాడిగా చెప్పుకుంటారని.. అలాంటప్పుడు చట్టసభల్లో పత్రికాధిపతికి చట్టాలు వర్తించవని చట్టం తీసుకురావాలని ఉండవల్లి సలహా ఇచ్చారు.

జగన్‌ను విమర్శిస్తే విశ్వాస ఘాతుకుడినే..

తనకు టీడీపీ, వైఎస్సార్‌సీపీ రెండు పార్టీలు సమానమేనని ఆయనన్నారు. రాష్ట్ర విభజన అంశంపై కోర్టులో కేసు వేయమని టీడీపీ ప్రభుత్వ హయాంలో అడిగితే పట్టించుకోలేదని.. అదే విషయమై ఇప్పుడు కోరితే తనను సపోర్ట్ చేస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తన కేసులో ఇంప్లీడ్ అవుతూ అఫిడవిట్ దాఖలు చేసిందన్నారు. ఎవరూ చేయలేని పని జగన్ చేశారని.. అలాంటప్పుడు కేసు తేలేవరకైనా కృతజ్ఞత లేకుండా ముఖ్యమంత్రి జగన్‌ను ఎందుకు విమర్శించాలని ఆయన ప్రశ్నించారు. అలా చేస్తే తాను విశ్వాస ఘాతకుడినవుతానన్నారు.

రామయ్యను దర్శించుకున్న కేరళ ఐజీ



రామాలయంలో ఐజీ లక్ష్మణ్ నాయక్

భద్రాచలంటౌన్: భద్రాద్రి శ్రీసీతారామచంద్ర స్వామి వారిని కేరళ ఐజీ లక్ష్మణ్ నాయక్ మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలకగా, ఐజీ ప్రధాన ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత నెల 31న జరిగిన పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకానికి వినియోగించిన శ్రీరామ పుష్కరిణి జలాన్ని సేకరించేందుకు దక్షిణ వైపునకు వెళ్లిన ఆలయ అర్చకులకు లక్ష్మణ్ నాయక్ సహకరించారు. దీంతో ఆలయ అధికారులు ఐజీని ఘనంగా సత్కరించి స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

- మూడో సెమిస్టర్‌లో 25.60 శాతం
- ఐదో సెమిస్టర్‌లో 39.41 శాతం ఉత్తీర్ణత

కేయూ క్యాంపస్ : కాకతీయ విశ్వవిద్యాలయ పరిధిలో ఈ ఏడాది జనవరి–ఫిబ్రవరిలో నిర్వహించిన డిగ్రీ మూడు, ఐదో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను వైస్ చాన్సలర్ ఆచార్య తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాసరావు మంగళవారం విడుదల చేశారు. బీఏ, బీకామ్, బీఎస్సీ కోర్సుల్లో మూడో సెమిస్టర్‌లో 64,940 మంది విద్యార్థులకు గాను 16,622 మంది(25.60 శాతం) ఉత్తీర్ణత సాధించగా.. ఇందులో అమ్మాయిలు ఎక్కువ మంది ఉత్తీర్ణులైనట్లు వెల్లడించారు. ఐదో సెమిస్టర్‌లో 48,840 మందికి గాను 19,250 మంది (39.41 శాతం) ఉత్తీర్ణత సాధించినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో చూడవచ్చని, ఫలితాలు కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు. విద్యార్థులు రీవాల్యుయేషన్‌కు ఏప్రిల్ 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. కార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు ఆచార్య మధుకర్, డాక్టర్ నరేందర్, ఆచార్య మహమ్మద్ ముస్తఫా, డాక్టర్ జ్యోతి, డాక్టర్ రాధిక, డిప్యూటీ రిజిస్ట్రార్ సారయ్య, క్యాంపు ఆఫీసర్ డాక్టర్ రాజు, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు లింగంపల్లి రాము, శ్రీలతాదేవి, ప్రణయ కుమార్ పాల్గొన్నారు.

జిల్లా వార్తలు

మూడూ కలిపి ముడి పెడితే..

- రఘునాథపాలెంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటుకు వినతులు
- కారేపల్లి, కామేపల్లి యూనిట్‌గా ఏర్పాటుకు అవకాశం
- ప్రస్తుతం కూసుమంచి వెళ్లి రావాల్సి ఉండడంతో అవస్థ



రఘునాథపాలెం మండల లావాదేవీలు కొనసాగించే కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

రఘునాథపాలెం: ఖమ్మం జిల్లా కేంద్రానికి ఆనుకున్న ఉన్న మండలం రఘునాథపాలెం. గతంలో గ్రామీణ మండలమే అయినా ఇప్పుడు జిల్లా కేంద్రంలో కలిసిపోతోంది. దీనికి తోడు ఈ మండల పరిధిలో గల వీ.వీ.పాలెంలోనే కలెక్టరేట్‌ను నిర్మించగా ఇటీవల ప్రారంభమైంది. దీనికి తగినట్లుగా భూముల ధరలకు రెక్కలు రావడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరందుకుంది. అయితే, అటు వ్యాపారులు, ప్రజలు భూములు అమ్మినా, కొన్నా రిజిస్ట్రేషన్ కోసం సుదూరంగా ఉన్న కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోంది. కూతవేటు దూరాన నగరంలో ఉన్న రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను దాటి జిల్లా కేంద్రానికి 25 కి.మీ. దూరంలో ఉన్న కూసుమంచి వెళ్లి రావడమనేది వ్యయప్రయాసలతో కూడిన వ్యవహారమే అని చెప్పాలి. దీనికి బదులు రఘునాథపాలెంలోనే రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటుచేస్తే ఈ మండలంతో పాటు కామేపల్లి, కారేపల్లి వాసులకు సైతం ఉపయుక్తంగా ఉంటుందని చెబుతున్నారు.

అన్ని కార్యాలయాలు రెడీ..

రఘునాథపాలెం మండల కేంద్రంలో పోలీసుస్టేషన్‌తో పాటు తహసీల్దార్ కార్యాలయం నిర్మాణ దశలో ఉన్నాయి. దీంతో పాటే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కూడా మంజూరు చేయాలనే డిమాండ్ వస్తోంది. ధరణి రాకముందు ప్లాట్లదారులే కాకుండా వ్యవసాయ భూములు ఉన్న రైతులు సైతం అమ్మినా, కొన్నా రిజిస్ట్రేషన్ అవసరాలకు కూసుమంచి వెళ్లాల్సి వచ్చేది. ఆతర్వాత ధరణి పోర్టల్ రావడంతో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ తహసీల్‌లోనే పూర్తవుతున్నా.. బ్యాంకుల్లో భూములు తాకట్టు పెట్టి రుణాలు పొందడానికి మళ్లీ కూసుమంచి కార్యాలయానికి పరుగులు తీయాల్సి వస్తుంది.


ఖమ్మంలో ఉన్నా బాగుండేది..

రిజిస్ట్రేషన్ అవసరాలకు కూసుమంచి వెళ్లి రావాల్సి వస్తుండడంతో రఘునాథపాలెం మండలంలోని 37 గ్రామపంచాయతీల పరిధిలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గతంలో మాదిరిగా కనీసం ఖమ్మంలో ఉంచినా బాగుండేదని, తీసుకెళ్లి కూసుమంచిలో కలపడం తమకు భారంగా మారిందని ఆవేదన చెందుతున్నారు. ఇవన్నీ పక్కన పెడితే మండలానికి చివరన ఉన్న పంగిడి, ఈర్లపుడి, రజబ్‌అలీ నగర్, రాంక్యాతండా తదితర గ్రామాల ప్రజల కూసుమంచి వెళ్లిరావడమంటే ఆ రోజంతా కోల్పోయినట్లే. ఒకవేళ కాలం కలిసిరాక పని కాలేదా.. మరో రోజు వెళ్లక తప్పడం లేదు.

ఇక్కడే ఎందుకంటే...

రఘునాథపాలెం మండల కేంద్రంగా నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేస్తే ఈ మండలంతోపాటు పక్కనే ఉన్న కామేపల్లి, కారేపల్లి మండలాల ప్రజలకు ఎంతగానో అందుబాటులోకి వస్తుంది. ప్రస్తుతం ఖమ్మం రూరల్ పరిధిలో ఉన్న కామేపల్లి, కారేపల్లి, కూసుమంచిలో ఉన్న రఘునాథపాలెం మండలాలను ఒక యూనిట్‌గా కొత్త సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేస్తే అందరికీ దూరాభారం తగ్గడంతో పాటు సమయం కలిసొస్తుందని అంటున్నారు. ఇటీవల రాష్ట్రంలో కొత్తగా రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసిన నేపథ్యాన.. రఘునాథపాలెంలో కూడా ఏర్పాటు చేసేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.


రఘునాథపాలెంలో ఏర్పాటు చేస్తేనే ప్రయోజనం



దూరం, ఖర్చులు తగ్గాలంటే రఘునాథపాలెంలో నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయాలి. ఈ మండలంలో అనేక గిరిజన గ్రామాలు ఉన్నాయి. వీటికి తోడు పక్కనే ఉన్న కామేపల్లి, కారేపల్లి మండలాలు కలిపితే అందరికీ ఉపయోగకరంగా ఉంటుంది.

–మాధంశెట్టి హరిప్రసాద్, సర్పంచ్, కోయచెలక


యూనిట్‌గా ఏర్పాటు ఎంతో ఉపయోగం



మూడు మండలాలు కలిపి యూనిట్‌గా రఘునాథపాలెంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేస్తే రైతులు, రియల్ వ్యాపారులు, ప్రజలకు మేలు జరుగుతుంది. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కొత్త కార్యాలయం ఏర్పాటుపై దృష్టి సారించాలి.

– మేకల మల్లిబాబు, డీసీసీబీ డైరెక్టర్, కామేపల్లి

దూరం పోయిరావడం ఇబ్బంది..



కూసుమంచి వెళ్లి రావడానికి సమస్యే కాక డబ్బు కూడా అదనంగా ఖర్చవుతోంది. రఘునాథపాలెం మండలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరిగింది. నిత్యం పదుల సంఖ్యలో రిజిస్ట్రేషన్లు జరుగుతుండడంతో ఇక్కడ కార్యాలయం ఏర్పాటు చేస్తే అందరికీ మంచిది.

– మెంటం రామారావు, సర్పంచ్, చింతగుర్తి

బొగ్గు డంపింగ్ స్టేషన్‌కు భూ సర్వే

కారేపల్లి: డోర్నకల్–భద్రాచలం రోడ్ రైల్వే మార్గంలోని కారేపల్లి మండలం గాంధీపురం రైల్వేస్టేషన్ సమీపంలో గల చర్లపల్లి వద్ద బొగ్గు డంపింగ్ స్టేషన్ ఏర్పాటుకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు మంగళవారం భూ సేకరణ సర్వే చేపట్టారు. ఇందుకు 20 ఎకరాల భూమి అవసరం కాగా, రైతుల నుంచి సేకరించేందుకు రైల్వే, రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా పది ఎకరాల చొప్పున మొత్తం 20ఎకరాల భూమి సేకరించి, కంకర క్రషర్లను ఏర్పాటు చేస్తామని, కంకరను అక్కడి నుంచి రైల్వే వ్యాగన్ల ద్వారా నూతనంగా నిర్మిస్తున్న రైల్వే ట్రాక్‌కు వినియోగించనున్నారని రైల్వే అధికారులు వివరించారు. సర్వే చేసిన వారిలో రైల్వే డీఐ లూర్దు, సర్వేయర్ అరుణ, రెవెన్యూ సర్వేయర్ బాషా, విజయ్ ఉన్నారు.



సర్వే నిర్వహిస్తున్న రైల్వే, రెవెన్యూ అధికారులు

కాంట్రాక్ట్ కార్మికులకూ ఓటు హక్కు కల్పించాలి

ఐఎఫ్‌టీయూ జాతీయ నేత సాధినేని



మాట్లాడుతున్న సాధినేని వెంకటేశ్వరరావు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో త్వరలో జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో సంస్థలోని వివిధ విభాగాల్లో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు కూడా ఓటు హక్కు కల్పించాలని ఐఎఫ్‌టీయూ జాతీయ నాయకులు సాధినేని వెంకటేశ్వరరావు యాజమాన్యాన్ని కోరారు. స్థానిక ఇఫ్టూ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కమీషన్ల కోసం కక్కుర్తి పడి లాభాల్లో ఉన్న సింగరేణి గనులను ప్రైవేట్‌పరం చేసేందుకు యాజమాన్యం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. అధికారుల సంఖ్యను అలాగే ఉంచి కార్మికులను తగ్గించటంలో అధికారుల పాత్ర చాలా ఉందని, సంస్థలో ఆందోళన కార్యక్రమాలు తగ్గించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారని విమర్శించారు. రాష్ట్రంలో నిరుద్యోగుల జీవితాలతో అటు ప్రభుత్వం, ఇటు అధికారులు ఆడుకుంటున్నారని అన్నారు. తాను 1987 నుంచి యూనియన్‌లో పనిచేస్తున్నానని, వైఎస్సార్ వంటి మహానేతలు యూనియన్ నాయకులకు అపాయింట్‌మెంట్ ఇచ్చి కార్మికుల సమస్యలపై చర్చించేవారని, కానీ ప్రస్తుత సీఎం కేసీఆర్, సింగరేణి సీఎండీ శ్రీధర్ తమకు ఆ అవకాశమే ఇవ్వడం లేదని వాపోయారు. సమావేశంలో ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ, కార్యదర్శి ఎం.శ్రీనివాస్, నాయకులు ఎస్.ఉపేందర్‌రావు, జె.సీతారామయ్య, అనురాధ, ఎల్.విశ్వనాథం, మారుతీరావు, హలీమొద్దీన్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పంట నష్టం సర్వే

ఖమ్మంవ్యవసాయం: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు జరిగిన పంట నష్టం సర్వే మంగళవారం కూడా కొనసాగింది. గత నెల 17 నుంచి 20వ తేదీ వరకు ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవటంతో జిల్లాలో మొక్కజొన్న, పెసర, స్వల్పంగా ఉద్యాన పంటలకు నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ గుర్తించింది. 19,732 మంది రైతులకు చెందిన 31,038 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. కాగా ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం అందిస్తామని ప్రకటించిన ప్రభుత్వం సమగ్ర సర్వే నిర్వహించాలని ఆదేశించింది. దీంతో కొద్ది రోజులుగా క్షేత్ర స్థాయిలో ప్రత్యేకాధికారులు, వ్యవసాయాధికారులతో బృంధాలు పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహిస్తూ, నివేదికలను జిల్లా వ్యవసాయ శాఖకు అందిస్తున్నారు. ఆయా నివేదికల ఆధారంగా కలెక్టర్ వీపీ గౌతమ్ పర్యవేక్షణలో పంట నష్టాల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. పంట నష్టం ప్రాథమిక అంచనాల కన్నా సర్వేల్లో కొంత మేరకు తగ్గే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మంగళవారం రాత్రి వరకు 80 శాతం వరకు పంట నష్టాల నమోదు ప్రక్రియ పూర్తికాగా, బుధవారం కూడా ఈ ప్రక్రియ కొనసాగనున్నట్లు సమాచారం. పంటలు ఎక్కువగా దెబ్బతిన్న బోనకల్, కొణిజర్ల, చింతకాని, వైరా మండలాల్లోని పలు గ్రామాల్లో ఇంకా సర్వే ప్రక్రియ కొనసాగుతోంది. పలు ప్రాంతాల్లో పంట నష్టాలను పరిశీలించిన కలెక్టర్ సర్వేల్లో లోటుపాట్లను గుర్తించినట్లు సమాచారం. సమగ్రంగా నివేదికలు ఇవ్వాలని సర్వే బృందాలను మందలించినట్లు కూడా తెలుస్తోంది.

'పచ్చని' పెదవాగు



పెదవాగు ప్రాజెక్ట్ పచ్చదనం పర్చుకుని చూపరులకు ఆహ్లాదం కలిగిస్తోంది. మండలంలోని గుమ్మడవల్లి వద్ద ఉన్న పెదవాగు ప్రాజెక్టుకు గేట్ల మరమ్మతుల నేపథ్యంలో గత నెలలో వరదనీరు పూర్తిగా వదిలేశారు. దీంతో ప్రాజెక్ట్‌లోని నీరంతా వెళ్లపోవడంతో.. ప్రాజెక్ట్ ప్రదేశం అంతా ప్రస్తుతం పచ్చని గడ్డి మొలిచింది. మొన్నటి వరకు జలకళతో కళకళలాడిన ప్రాజెక్ట్ ఇప్పుడు పచ్చదనంతో ఆకట్టుకుంటోంది. –అశ్వారావుపేటరూరల్